మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-జీకే వీధి: మండలంలోని ఏకలవ్య పాఠశాల లో మాదకద్రవ్యల వ్యతిరేక దినోత్సవంన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీనీ ఏకలవ్య పాఠశాల పిల్లలతో ఎక్సేంజ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై.రాజు ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెడు వ్యసనాలకు, మత్తు అలవాట్లకు బానిస కాకుండా దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సేంజ్ అధికారులు గణేస్వరరావు, ఎం.సత్యనారాయణ,హెడ్ కానిస్టేబుల్స్, ఏకలవ్య ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై గిరిజనులకు అవగాహన కల్పించండి

20 మంది ఉద్యోగులకు ఎక్సలెన్స్ అవార్డులు ప్రధానం
ఐటీడీఏ పీవో వి.అభిషేక్

విశాలాంధ్ర-అరకులోయ : గిరిజనులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని వి.అభిషేక్ స్పష్టం చేశారు. స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో మంగళవారం నిర్వహించిన సబ్ డివిజనల్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ అధికారులకు సిబ్బందికి గ్రామాల్లోని అందరితో అనుబంధం ఏర్పడుతుందని చెప్పారు. ఇంటింటికి వచ్చి పోస్టల్ సేవలను అందిస్తారని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న బీమా పథకాలు, హోస్టల్ బ్యాంకింగ్ కార్యక్రమాలను, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. మారుమూల గ్రామాలకు పోస్టల్ శాఖ సేవలందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి సుకన్య సమృద్ధి యోజన పై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు తాసిల్దార్లు సహకారం తీసుకుని గ్రామాల్లో పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న పొదుపు పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భవతులకు మాతృ వందన యోజన, భీమా పథకాలపై వివరించాలని తెలియజేశారు. 140 మంది పోస్టల్ సిబ్బందిలో 20 మందికి అవార్డులు రావడం గర్వకారణం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో అందరూ సమానమేనని అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పోస్టల్ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా పివిటిజిలకు హోస్టల్ బ్యాంకింగ్ కార్యకలాపాలపై చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు విద్యార్థులకు పోస్టల్ శాఖలో ఉద్యోగాలు ఎలా పొందాలో తెలియజేయాలన్నారు. అనంతరం పోస్టల్ బీమా లబ్ధిదారులకు బీమా పాలసీ పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. పోస్టల్ ఉద్యోగులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అంద జేశారు. అదేవిధంగా పోస్టల్ అధికారులు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో అరకు వ్యాలీ ఎంపీడీవో, పలువురు పోస్టల్ అధికారులు సిబ్బంది, సర్పంచ్ దాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్మూలనకై స్వచ్ఛంధ ట్రాక్టర్లు పంపిణీ

ఎంపీపీ ఈశ్వరి జడ్పిటిసి జానకమ్మ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : పంచాయితీ గ్రామాలోగల గిరిజనులకు ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుద్యం నిర్మూలనకై స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా పంచాయితీలకు ట్రాక్టర్లను పంపిణీ చేస్తుందని స్థానిక ఎంపీపీ బీ.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్. జానకమ్మ చెప్పారు. ఈ పథకంలో భాగంగా మండలంలోని గసభ, గుంటసీమ, కించుమండ , పోతంగి పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎంపీడీవో జయ ఉమా ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ, జడ్పిటిసి పాల్గొని పంచాయతీ సర్పంచ్ లకు అప్పగించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పేరుకుపోవడం వల్ల పలు రకాల వ్యాధులు ప్రబలుతుండడంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద కార్పొరేషన్ పథకంలో భాగంగా పరిశుద్ధాన్ని తొలగించి డంపింగ్ యార్డులకు తరలించడానికి ఉచితంగా ట్రాక్టర్లను పంపిణీ చేసిందన్నారు. మండల వ్యాప్తంగా 18 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం మొదటి విడతలో నాలుగు పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయన్నారు. వీటిని నాలుగు పంచాయతీలే కాకుండా మిగిలిన పంచాయతీల్లో కూడా సర్దుకుని గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, గసభ సర్పంచ్ పి. సునీత,కించుమండ సర్పంచ్ హెచ్ బి చెల్లమ్మ, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, ఎంపిటిసి జమ్మ, ఇన్చార్జి ఈవోపీఆర్డి విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జిల్లా డైరెక్టర్ ఎం శ్రీరాములు, వైసిపి నాయకులు బి సింహాచలం, హెచ్ బి బాబూరావు, సర్పంచ్ వెంకటరావు, చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గంజాయి తరలిస్తూ యువకులు పట్టివేత

విశాలాంధ్ర-అనంతగిరి : సోమవారం సాయంత్రం, అనంతగిరి మండలం, డముకు వ్యూ పాయింట్ దగ్గర చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలో భాగంగా విశాఖపట్నంకు చెందిన యువకులు ఇద్దరు చింతపిల్లి అప్పలరాజు, గుంట భరత్‌లు, మరియు అల్లూరి సీతారామరాజు జిల్లా, దుంబ్రిగుడ మండలం, గసభ పంచాయతీ, అద్రగుడ గ్రామంకు చెందిన కిల్లో రాజు, ఎ.రాజేష్ అనే వ్యక్తులు కలిసి, AP 39 SK 5469 నంబర్ గల స్కూటీపై అక్రమంగా 2 కేజీల గంజాయిని విశాఖపట్నం తరలిస్తుండగా, ఎస్ఐ రాము, సిబ్బందితో కలిసి పట్టుకొని, రిమాండుకు మంగళవారం సెంట్రల్ జైలుకు పంపించారు.

పివిటిజి గ్రామాలను ఆదర్శ గ్రామంలా అభివృద్ధి

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

విశాలాంధ్ర-అనంతగిరి : ప్రధానమంత్రి జన్మన్ పథకంలో పివిటిజి గ్రామాలకు అన్ని వసతులు,మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. మంగళవారం చిలకల గెడ్డ పంచాయతీ మెట్టపల్లి గ్రామం సందర్శించారు. పివిటిజి గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు విద్యుత్ సదుపాయం లేని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి 20 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తూ గ్రామ సభ తీర్మానం చేసి భూమిని అప్పగించాలని చెప్పారు. అర్హులైన రైతులందరికీ పిఎం కిసాన్ పథకాన్ని వర్తింప చేస్తామన్నారు. గ్రామస్తులు వీడి వీకె ను వద్దంటున్నారని, మేకలను మంజూరు చేయాలని కోరుతున్నారని ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు లేని వారికి బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేస్తామన్నారు. వంతెన నిర్మాణానికి, రహదారి పనులకు రివైజ్డ్ శాంక్షన్ ఆర్డర్లను తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి సంబంధిత శాఖలలో అమలు చేస్తున్న పథకాలను మెట్టపల్లి గ్రామానికి మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామంలో సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించింది లేనిది గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎస్ సహాయ ప్రాజెక్టు అధికారులు బిఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ ఈ ఈ బి.బాబు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్ బి ఎస్ నందు, ఐసిడిఎస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గోడౌన్ దగ్ధం

కాలి బూడిదైన 5కోట్ల రూపాయల బీడీ ఆకు
విచారించి తగు చర్యలు చేపట్టాలంటున్న గోడౌన్ యాజమాని ఫిర్యాదు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల ఎర్రంపేట లోని ఏడుగురాళ్ళపల్లి తాటిలంక వెళ్ళే దారిలో బీడీ ఆకు వ్యాపారం కొరకు గోడౌన్ నిర్మించి, సదరు గోడౌన్లో 2021 నుండి బీడీకి ఉపయోగించే తునికాకు నిల్వ ఉంచుతున్నట్లు హైదరాబాద్ లోని మొహదీపట్నంకు చెందిన అబ్దుల్ ముకిమ్, అహ్మద్ అబ్దుల్ నయిమ్లు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం వారు చింతూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సదరు బీడీ ఆకు ప్రభుత్వ టెండర్ ద్వారా ఫారెస్టు డిపార్టుమెంట్ అనుమతులతో కొనుగోలు చేసి కంపెనీల అవసరాల ప్రకారం వివిధ ప్రాంతాలకు విక్రయించడం చేస్తుండేవారని వారు తెలిపారు. ఈ క్రమంలో ది.15/16-06-2024న అర్ధరాత్రి సుమారు గం.2.30ల సమయంలో మా గోడౌన్లో అగ్ని ప్రమాదం జరిగిందని వాచ్మెన్ షేక్ భాజాని ఉదయం గం.6.00లకు చరవాణి తెలిపినట్లు అబ్దుల్ ముకిమ్, అహ్మద్ అబ్దుల్ నయిమ్లు వెల్లడించారు. అనంతరం నేను ఏడుగురాళ్ళపల్లి వచ్చి చూడగా మా గోడౌన్ పూర్తిగా కాలి పోయి అందులో నిల్వ ఉంచిన బీడీ ఆకు మొత్తం అగ్నికి ఆహుతి అయిందని, మాకు అందుబాటోలు ఉన్న రికార్డుల ప్రకారం మా గోడౌన్లో సుమారు రూ.5,39,73,000ల సరుకు కాలి బూడిద అయినట్లు వారు స్పష్టం చేశారు. గోడౌన్లో ఉన్న సరుకు మొత్తంనకు పూర్తి ఆధారాలు ప్రభుత్వ టెండర్ ద్వారా సేకరించిన రికార్డుల ప్రకారం కలవన్నారు. జరిగిన అగ్ని ప్రమాదంపై దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి

మహిళ పోలీస్, చైల్డ్ ప్రొటెక్షన్ ఫోరం మండల కన్వీనర్ల సమాచారంతో కదిలిన యంత్రాంగం

విశాలాంధ్ర-జీకే వీధి: మండలంలో మొండిగడ్డ పంచాయతీ బూరుగుపాకులు గ్రామానికి చెందిన ఇద్దరూ మైనరులు ఒకరినొకరు ఇష్టపడడంతో వారికి పెద్దలు వివాహం చేయుటకు తేదీని నిశ్చయించి వివాహ ఆహ్వానపత్రం బంధువులకు పంచుతుండగా ఆ విషయం స్థానిక సచివాలయం చెందిన మహిళ పోలీస్ మరియు చైల్డ్ ప్రొటెక్షన్ ఫోరం మండల కన్వీనర్ సోమేశ్ కుమార్ కలిసి గూడెం కొత్త వీధి మండలం ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీదేవి,సూపర్వైజర్ మోహిని మొండిగడ్డ మహిళా పోలీస్ మరియు బాలల హక్కుల పరిరక్షణ ఫోరం జీకే విధి మండల కన్వీనర్ మడపల సోమేష్ కుమార్ వారి ఇరువురి కుటుంబాలను జీకే వీధి పోలీస్ స్టేషన్ కు పిలిపించి బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని పెద్దల సమక్షంలో వారిని ఒప్పించి బాల్య వివాహం ఆపివేయడం జరిగింది.కుటుంబ పెద్దలకు బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారంగా నిర్ణయించిన వయసు దాటే వరకు వివాహం చేయమని అంగీకార పత్రం రాయిస్తూ,తదుపరిగా వివాహం చేయాలని ప్రయత్నం చేస్తే పోక్స్ చట్టం ప్రకారంగా శిక్షలు తప్పవని ఇరువురు తల్లిదండ్రులకు సోమవారం వారికి బైండోవర్ కింద కేసు నమోదుసేసి,మండలంలోని మరొక మారు జరిగితే సహించేది లేదని సిడిపిఓ లక్ష్మీదేవి హెచ్చరించారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పిహెచ్‌పి అసోసియేషన్ పార్వతీపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సింహాచలం, నడిమింటి.గోపాలనాయుడు తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా రాగోలకు చెందిన జెమ్స్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని పిహెచ్‌పి సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఈఓ సందర్శన

విశాలాంధ్ర-సీతానగరం.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ మంగళవారం ఆకస్మిక సందర్శన చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి ఆరోగ్యపరమైన సౌకర్యాలు కల్పించాలని, 'డయేరియా' పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యా బోధనలో టీ ఎల్ ఎం ఉపయోగించాలని, డైరీలు, పాఠ్యప్రణాళికలతో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యాకిట్లపై ఆరా తీశారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని కోరారు. అడ్మిషన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇళ్ళా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేలా చర్యలు చేపట్టాలి : డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-పార్వతీపురం : సీజనల్ జ్వరాలను అదుపులో ఉండేలా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ కె. విజయ పార్వతి అన్నారు. మంగళవారం నాడు ఆమె కురుపాం, గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రాజిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావుతో కలిసిఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సూపరింటెంట్‌లతో మాట్లాడి ప్రతిరోజూ జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు,ఏ విధమైన జ్వారాలుగా గుర్తించడం జరిగింది. వారికి అందజేస్తున్న చికిత్స, ఏ ప్రాంతాల నుండి ఎక్కువగా వస్తున్నారు, మొదలగు వివరాలపై ఆరా తీశారు. ల్యాబ్‌లను తనిఖీ చేసి జ్వర నిర్ధారణ పరీక్షలు చేస్తున్న తీరును అడిగి, అక్కడ ఉన్న రక్తపూతల స్లైడ్‌లను పరిశీలించారు. మలేరియా జ్వర నిర్ధారణ విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పరీక్షలు జరపాలని ఆదేశించారు. ప్రసూతి గది, రక్తనిధి కేంద్రం, వార్డులను తనిఖీ చేసి ప్రతినెలా జరుగుతున్న ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు. జ్వరాలు, డయేరియా తదితర సీజనల్ వ్యాధులతో వచ్చే రోగులపై ప్రతేక దృష్టి సారించాలన్నారు. మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి ల్యాబ్, ప్రసూతి గది తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్స్ డా.శోభారాణి, డా.త్రివేణి, వైద్యాధికారి డా.హర్ష, ఏఎమ్ఓ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు మెరుగైన చర్యలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణంలో తాగునీటి సరఫరాకు మెరుగైన చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా కార్యక్రమం ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం పట్టణంలో ఉన్న త్రాగునీటి ట్యాంకులను శుభ్రం చెయ్యడం జరుగుతుందన్నారు. ఎమినిటీ సెక్రటరీల ద్వారా వాటర్ పైప్ లైన్ లీకేజీలను గుర్తించి వాటి మరమ్మత్తులు చేయించే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటుపైప్ లైన్లు క్లీనింగ్, వాటర్ క్లోరినేషన్ కూడా జరుగుతుందన్నారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు మేస్త్రి లు దగ్గరుండి వార్డుల లో డిసిల్టింగ్ పనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ పూర్తిస్థాయిలో జరిగే విధంగా చూసుకోవాలని ఆదేశించడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-గరుగుబిల్లి/జియ్యమ్మవలస : గరుగుబిల్లి మండలం దళాయివలస గ్రామంలో అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గరుగుబిల్లి ఎస్ఐ వై. అమ్మన్నరావు తెలిపిన వివరాలు ఇలావున్నాయి. గరుగుబిల్లి మండలం గ్రామానికి చెందిన ఏగిరెడ్డి వెంకటరమణ (47) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారన్న సమీప బంధువుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించామన్నారు. మృతునికి భార్య భవానీ, కుమార్తె ధనుష్ ఉన్నారని మృతుడు సోమవారం తన పొలంలో పురుగుల మందు పిచికారీ చేసి ఇంటి వచ్చారని, ఈయనకు మద్యం అలవాటు ఉందని తెలిపారు. మృతుడుని పరిశీలించగా శరీరమంతా పలుచోట్ల గాయాలతోపాటు రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంకటరమణ మృతి చెందాడని భార్య భవాని చుట్టు ప్రక్కల వారికి ఉదయం తెలియజేయడంతో చుట్టుప్రక్కల వారు వచ్చి మంచంపై మృతిచెందిన వెంకటరమణను కిందకు దించారని తెలిపారు. ప్రాథమిక వివరాలను సేకరించి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించామని మృతుని వివరాలపై చినమేరంగి సిఐ మంగరాజు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మృతునికి అతని భార్య భవానీల మధ్య గత కొంతకాలంగా చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయని, వీరిద్దరిమధ్య మనస్పర్థలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నిజనిజాలు తెలుసుకుంటామని, మృతుని కుమార్తె ధనుష్ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాజా నోటిఫికేషన్ ద్వారా సిఆర్టీల ఎంపిక జరగాలి

- అక్రమంగా అనర్హతతో రెగ్యులర్ అయినవారిపై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఐటీడీఏ పీఓకు ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వినతి

విశాలాంధ్ర-బెలగాం : గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యాసంస్థలలో బోధన, బోధనేతర సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆర్.సి నంబర్ 6376/98 తే02-11-2008దీ ఇచ్చిన ఆదేశాలు అనుసరించి, ప్రతి విద్యా సంవత్సరంలో తాజా నోటిఫికేషన్ ఐటిడిఏ వారు జారి చేసి సిఆర్టి టీచర్ ఎంపిక చేయాలని కోరుతూ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పార్వతీపురం ఐటిడిఎ పిఓ సి. విష్ణు చరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐటిడిఎ సబ్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్‌లో పేరు నమోదు చేసుకుని అర్హత గలవారిని సిఆర్టిలుగా ఎంపిక చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారని, ప్రభుత్వ ఆదేశాలు జీవో ఎంఎస్ నెంబర్ 57 సాధారణ పరిపాలన శాఖ తేదీ 1-3-2014 ప్రకారం ఐటిడిఎ పరిధిలో జరుగు నియామకాలకు డీఎస్సీ చైర్మన్‌గా ఐటిడిఎ పిఓకు ఉన్న అధికారాలకనుగుణంగా తగు చర్య తీసుకోవాలని ఐటిడిఎ పిఓకు వినతిపత్రం అందచేయగా ప్రభుత్వానికి లేఖ రాస్తానని పిఓ హామీ ఇచ్చారని తెలిపారు. ఇటీవల జరిగిన సిఆర్టి టీచర్ రెగ్యులరైజేషన్లో పార్ట్ టైంగా పనిచేసినవారు 5గురు, మిగిలినవారు 2012, 13, 14, 15లో పార్ట్ టైంగా పనిచేసినవారు అనేకమంది మరియు వివిధ సబ్జెక్టులలో సిఆర్టిగా పనిచేసే స్కూల్ అసిస్టెంట్ కేవలం సబ్జెక్టు ప్రస్తావన లేకుండా సుమారు 13 మంది మరియు సిఆర్టిలో హిందీగా పనిచేసే ఎల్.పి, భాషా పండితులను గ్రేడ్2గా రెగ్యులర్ అయ్యారని ఈ విధంగా అక్రమంగా అనర్హతతో రెగ్యులర్ అయినవారిపై సమగ్ర విచారణ చేపట్టి వారందరి రెగ్యులర్ రద్దు చేయాల్సిందిగా ఐటిడిఎ పిఓని కోరగా సానుకూలంగా స్పందించి పూర్తి వివరాలు సమర్పించిన ఎడల తగు చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ దుక్క సీతారాం, బి. రామారావు, సిహెచ్ కృష్ణ, కె.బాబ్జి, బి.స్రవంతి, జి.మౌనిక, టి.అమర జ్యోతి, ఎం.దివ్య, నిరుద్యోగ యువత హాజరయ్యారు.

ఎన్నికల విధినిర్వహణలో అధికారులు, సిబ్బంది పనితీరు భేష్

మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

విశాలాంధ్ర-పార్వతీపురం : సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోపోలీసు అధికారులు, సిబ్బంది, ఎలక్షన్ సెల్, ఎస్బి, డి సీ ఆర్ బి,ఏఆర్ పోలీస్ శాఖ యంత్రాంగం అందరూ సమిష్టి కృషితో, సమన్వయంతో పనిచేయడం ఎన్నికల నిర్వహణలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతయుతంగా ఎన్నికలు ముగిసాయని, సిబ్బంది పనితీరు బేష్ అని జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ తెలిపారు. మంగళవారం నాడు జిల్లా క్రైం మీటింగు జరిగింది. ఎన్నికల కమీషను, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి, గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. జిల్లాలోని విధులు నిర్వర్తిస్తున్న హెూంగార్డు నుంచి అధికారుల వరకు కూడా ఆత్మస్థైర్యంతో ముందుకు నిలబడి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఎన్నికలు జరిగిన రోజుగాని, కౌంటింగ్ రోజు, కౌంటింగ్ అనంతరం ఎలాంటి ఘటనలు జరగకుండా బాగా కష్టపడి ఉద్యోగం చేశారని పేరుపేరున అందరికీ ఎస్పీఅభినందనలు తెలియజేశారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ పేరు పేరునా అభినందించి, వారికి ప్రోత్సాహక బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేసారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పని చేయాలని, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పనిచేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అనంతరం, గతంలో నమోదైన తీవ్రమైన నేరాల్లో నమోదైన కేసులను జిల్లాఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో సాధించిన పురోగతిని సంబంధిత దర్యాప్తు అధికారులను అడిగి తెలుసుకొని, కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించి, దర్యాప్తు అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసారు. ప్రతిభకనబర్చిన పోలీసు అధికారు లకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) డా.ఓ. దిలీప్ కిరణ్,పార్వతీపురం ఏఎస్పీ సునీల్ షరోన్,దిశా డిఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్ డివిజన్ డిఎస్పీ జి.వి. కృష్ణారావు, ఎస్సి & ఎస్టి సెల్ డిఎస్పి జి.మురళీధర్, ఏఆర్ డిఎస్పి ఎస్.వెంకట అప్పారావు, ఎస్బీ సిఐ సిఎచ్.లక్ష్మణరావు, డి.సి.ఆర్.బి. సిఐ బి.ఎం.డి. ప్రసాద్ రావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆడ ఏనుగు మృతి

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండలంలోని తోటపల్లి గ్రామ సమీపంలోని కర్రల మిషన్ పరిసరాల్లో మంగళవారం ఆడ ఏనుగు మృతిచెందింది. గత ఆరేళ్లుగా జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి, కురుపాం మండలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. ఏనుగులకు అవసరమైన తాగునీరు, ఆహారం పుష్కలంగా లభిస్తుండడంతో ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. అటవీశాఖ సిబ్బంది ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికీ మరలా వస్తున్నాయి. మంగళవారం సుమారు 16 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న ఆడ ఏనుగు అనారోగ్యంతో మృతి చెందింది. ఈ ఏనుగుకు గత రెండు రోజుల నుంచి అజీర్ణ సమస్య ఉండడంతో ఆటవీశాఖ సిబ్బంది వైద్యం కూడా నిర్వహిస్తున్నారు. అయితే అనారోగ్యం మరింత విషమించడంతో మృతిచెందినట్లు సిబ్బంది తెలిపారు. 8 ఏనుగుల సమూహంలో ఒక ఏనుగు మృతిచెందడంతో ప్రస్తుతం ఏడు ఏనుగులు ఉన్నాయి. ఏనుగు మృతి చెందడంతో జిల్లా అటవీశాఖాధికారి జి. ప్రసన్నకుమారి, విశాఖపట్నం జూ పార్క్ వైద్యులు ఫణీందర్, విఆర్ఓ రవికుమార్, స్థానిక పశువైద్యాధికారి సురేష్ కుమార్, అటవీశాఖ రేంజర్ మణికంటేష్ పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించి ఆ ప్రాంతంలోనే ఖననం చేశారు.

ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శన

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కురుపం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులు పొందుతున్న సేవలు పరిశీలించారు. అలాగే త్రాగునీరు, మరుగుదొడ్లు, వార్డుల పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో రోగులకు సేవలు అందించాలని సంబంధిత వైద్యులను సూచించారు. రోగులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గంగవరం : యువతీయువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు, దురవ వ్యసనాలకు దూరంగా ఉండాలని రామకృష్ణ కోరారు. సోమవారం స్థానికలో అనే అవగాహన కార్యక్రమంనిర్వహించారు.యువత సాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జీవితాలు నాశనం అవుతాయని, తల్లిదండ్రులకు మనశ్శాంతి లేని వరిస్థితులు ఏర్పడతాయన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ..... మా సమస్యలు పరిష్కరించరూ

నూతన ఎమ్మెల్యేకు సమస్యలతో స్వాగతిస్తున్న పట్టణ ప్రజలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గెలుపొందిన బోనెల విజయచంద్ర అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బుధవారం నియోజకవర్గానికి చేరుకోనున్నారు. బుధవారం ఎమ్మెల్యేను పార్వతీపురం పట్టణంలోకి ర్యాలీగా స్వాగతించేందుకు ఆ పార్టీ కేడరంతా తగిన ఏర్పాట్లు చేసింది.అయితే పట్టణ ప్రజలు మాత్రం నూతన ఎమ్మెల్యేకు నేటికీ పరిష్కారం కానీ సమస్యలతో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు.గడచిన ఎన్నికలలో ఈ నియోజకవర్గంలో అనేకమంది శాసనసభ్యులుగా గెలిచి తనదైన శైలిలో నియోజకవర్గ అభివృద్ధిని చేశారు.కానీ ఇంతవరకు గెలిచిన శాసనసభ్యులలో ఒక్కరు కూడా స్థానికులు కాకపోవడం వలనో ఏమో కానీ పార్వతీపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి పార్వతీపురం పట్టణంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యల పైన మాత్రం పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదన్న అనుమానం పట్టణ ప్రజలను పీడిస్తుంది.ప్రధానంగా పార్వతీపురం మున్సిపాలిటీలో 30 వార్డుల్లో నివసిస్తున్న ప్రజలకు నేటికీ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో త్రాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది.దాదాపు 70 సంవత్సరాలు క్రితం నగర పంచాయతీగా ఉన్న రోజుల్లో వేసిన పైపు లైన్ ద్వారానే నేటికీ త్రాగునీటి సరఫరా జరుగుతుంది.నాడు వేలల్లో ఉన్న జనాభాకు నేడు లక్షల్లో పెరిగిన జనాభాకు అదే పైపులను ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు ఏవిధంగా సరిపోతుందో ఇట్టే అర్థమవుతుంది. వర్షాకాలం వస్తే బురద నీరు వేసవికాలం వస్తే విద్యుత్ సరఫరా ఆటంకం వల్ల పూర్తిగా నీటి సరఫరా ఆగిపోయే పరిస్థితి నెలకొంటుంది దీన్ని బట్టి చూస్తే సంవత్సరంలో ఎన్ని రోజులు త్రాగునీటి సరఫరా అవుతుందో అర్థమవుతుంది.అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి లక్ష్యాన్ని నెరవేరుద్దామంటే ఇంతవరకు ఏ ప్రజా ప్రతినిధి వారి లక్ష్యానికి సహకరించకపోవడం శోచనీయం.ఈ త్రాగునీటి సరఫరా విషయమై పట్టణ ప్రజలు, ప్రజాసంఘాలు ఎన్ని మార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిన ఫలితం మాత్రం నేటికీ శూన్యంగానే మిగిలిపోయింది. పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌కు ఆనుకుని ఉన్న పంట పొలాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఈ వ్యవసాయానికి సాగునీరు అందించే గోప సాగరం కలుషితం అవుతుందని పంటలు పాడవుతున్నాయని ఇక్కడ నుంచి డంపింగ్ యార్డును తరలింపు చేయాలని రైతు సంఘాలు ప్రజా సంఘాలు పోరాటాలు చేసి ప్రజాప్రతినిధులకు తమ గోడును వినతి పత్రాలు ద్వారా వినిపిస్తే ఆ పత్రాలు బుట్ట దాఖలు అయ్యాయే తప్ప రైతన్నల గోడు మాత్రం పరిష్కారం కాలేదు. ఇక పట్టణంలో ప్రధాన రహదారిలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మిస్తామని గత శాసనసభ్యులు పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయింది.ఇదిలా ఉండగా పేదవానికి సొంతగూడు నెలకొల్పాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన టిడ్కో గృహాల కోసం అనేకమంది పట్టణ పేద ప్రజలు ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు చెల్లించారు. టిడ్కో గృహాలలో ప్రజలకు ఇల్లు మంజూరు కాలేదు సరి కదా చెల్లించిన డబ్బులు కూడా వెనక్కి రాకపోవడంతో నేటికీ వడ్డీలు కడుతూ అప్పులు పాలయ్యే పరిస్థితి నెలకొంది.అలాగే గత ప్రభుత్వం పేదలకోసం ప్రవేశపెట్టిన జగనన్న కాలనీల్లో కూడా లబ్ధి దారులకు సంభందించిన స్థలాల్లో ప్రజా ప్రతినిధుల అండతో కొంతమంది బినామీలు దౌర్జన్యంగా గృహాలు నిర్మించుకున్నారని వాటిని ఖాళీ చేయించి నిజమైన లబ్ధిదారులకు అందచేయాలని అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ నేటికీ జగనన్న కాలనీలలో జగడాలు కొలిక్కిరానిపరిస్థితి నెలకొంది. ఇటీవల నూతనంగా శాసనసభ్యులుగా ఎన్నిక కాబడిన బోనెల.విజయ చంద్ర నేడు పట్టణానికి వస్తున్న సందర్భంగా ఈసమస్యలను పరిష్కరిస్తారన్న కోటి ఆశలతో పట్టణ ప్రజలు స్వాగతిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్యలతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండండి

చింతపల్లి ఎంపీడీవో వీర సాయిబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : వర్షాకాలంలో మారుతున్న వాతావరణ మార్పుల కారణంగా ప్రబలేటీ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని ఎంపీడీవో వి. వీర సాయిబాబా అన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బందితో పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయం చేసుకొని గ్రామాలలు అపారిశుద్ధ్య సమస్యతో పాటు, మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్త తొలగింపు మురుగు కాలువలలో నిలువ ఉన్న మురుగునీరు పోయే మార్గం చూడాలని, ఇంకుడు గుంతలో నిల్వ ఉన్న నీరును బయటకు పోయే మార్గం చూడాలన్నారు. మురుగు కాలువలలో నీరు నిలువ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, డయోరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. పంచాయతీరాజ్ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు గ్రామాలలో సందర్శించి ఇంటింటికి కులాయిల పైపులను తనిఖీ చేసి శిథిలావస్థకు చేరిన పైపులకు మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశించారు. మారుమూల గిరి గ్రామాలలో ఇంకుడు గుంతలు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. వారం రోజుల పాటు దగ్గు, జలుబు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధుల నిర్ధారణకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకుని వైద్యాధికారి సూచనల మేరకు మందులు వాడాలన్నారు. రోగులు సకాలంలో మందులు వాడటం వలన వ్యాధులు తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కే శ్రీనువాస్, నీటిపారుదల శాఖ ఏఈ జి స్వర్ణలత, ఏఎన్ఎంలు, ఎం ఎల్.హెచ్.పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు, గ్రామీణ నీటిపారుదల శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయండి : ఐటిడిఏ పిఓ గనోరే

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారి చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ఏజెన్సీలోని నిర్మిస్తున్న అభివృద్ధి పనులు పురోగతిపై ప్రాజెక్ట్ అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని మండలాలలోని చేపట్టిన పనులన్నీ నిబంధన ప్రకారం సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు, ఏజెన్సీలోని కొన్ని మండలాలలో ఆశ్రమ పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు ఈ స్టేజిలో ఉన్నవి అదేవిధంగా బోర్లు, వాటర్ ట్యాంకులు ఎన్ని నిర్మించుచున్నది మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. కొన్ని మండలాలలో పూర్తయిన భవనాలకు రంగులు ఈ విధంగా వేయుచున్నది ఆయన ఆరా తీశారు. కొత్తగా మంజూరైన భవనాలు ఎన్ని పూర్తయినవి, మరి కొన్ని భవనాలు ఏ స్టేజిలో ఉన్నవి మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. మంజూరైన భవనాలకు ఏసిమెంట్ వాడుతున్నది అదేవిధంగా ఇసుక ఎక్కడి నుంచి తీసుకొని వచ్చుచున్నది ఆయన ఆరా తీశారు. అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. గోకుల పథకం ద్వారా నిర్మిస్తున్న పశువుల షెడ్లు ఒక్కొక్క మండలంలో ఎన్ని మంజూరైనవి అదేవిధంగా ఎన్ని పూర్తి చేసింది ఇంకా ఎన్ని షెడ్లు పూర్తి చేయవలసి ఉన్నది మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవనాల పనులు ఈ దశలో ఉన్నవి ఆయన ఆరా తీశారు. జీసిసి స్టోర్స్ పనులు ఏవిధంగా జరుగుచున్నవి మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. గుడిస పర్యటక కేంద్రంలో ఏర్పాటు చేయుచున్న భవనాలు ఏ దశలో ఉన్నవి అదేవిధంగా బోర్లు, వాటర్ ట్యాంక్ ఏవిధంగా ఏర్పాటు చేయుచున్నది ఆయన ఆరా తీశారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఏడు మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 75 పనులు మంజూరు చేయడం జరిగిందని ఇందులో సిసి రోడ్లు, బీటీ రోడ్లు అదేవిధంగా మరికొన్ని అభివృద్ధి పనులు ఏదశలో ఉన్నవి ఎన్ని పనులు పూర్తయినవి ఇంకా ఎన్ని పనులు పూర్తి చేయవలసి ఉన్నది మండలాలవారీగా ఆయన ఆరా తీశారు. వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని చింతలపూడి గ్రామ సమీపంలోని కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులు ఏదశలో ఉన్నవి ఆయన ఆరా తీశారు. అన్ని మండలాల్లో అభివృద్ధి పనులకు కూలీలు అందుబాటులో ఉన్నది లేనిది మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉన్న మా దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈసమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్‌రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గౌతమి, చైతన్య, నాగరాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, వీరభద్రరావు, ఎస్ఓ టీ. మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న శ్రీకృష్ణ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. రాజు, డి. వందు మాట్లాడుతూ ప్రతిఏటా ప్రభుత్వా నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులను నిలువు దోపిడీ చేయడానికి ప్రైవేట్ కార్పొరేట్, పాఠశాల పుస్తకాల అమ్మకం చేపడుతున్నాయి అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి వచ్చేన ఫిర్యాదు ఆధారంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న రూముల్ని గుర్తించామని తెలిపారు. ఇప్పటికే ట్యూషన్ ఫీజుల రూపంలో వేలల్లో వసూలు చేస్తున్నా, పుస్తకాలు యూనిఫారల రూపంలో అదనంగా మరో ఇరవై వేల రూపాయలు వసూలు చేస్తున్నాయని తెలిపారు.తక్షణమే జిల్లా వ్యాప్తంగా పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని, వాటి లైసెన్స్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్యులు విద్యార్థుల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకొని పుస్తకాల అమ్మకాలు ఆపాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలలో పుస్తకాలను అమ్ముతున్న రూమ్ లను సీజ్ చేయించి పాఠశాలను లైసెన్స్ రద్దు చేసేలా పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు మేరకు డిప్యూటీ ఎంఈఓ కె. ప్రసాద్ ఘటన స్థలానికి వచ్చి శ్రీకృష్ణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న గదులను సీజ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హెచ్. సింహాచలం టి. అఖిల్ మరియు పట్టణ కమిటీ సభ్యులు లావణ్య, సూర్య, రవి, సంజీవ్, ఐబో పాల్గొన్నారు.

పాలమామిడి గ్రామాన్ని సీఐ రమేష్ సందర్శన

విశాలాంధ్ర - జి మాడుగుల : మండల కేంద్రంలో మంగళవారం పాలమామిడి పంచాయతీలో పాలమామిడి గ్రామాన్ని స్థానిక సీఐ రమేష్ సందర్శించారు. దీనిలో భాగంగా మొదటిగా గ్రామంలో పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి కొరత ఉందని చెప్పడం జరిగింది పై అధికారులకు తెలియపరిచి వీలైనంత తొందరగా దాన్ని పరిష్కరించే విధంగా చేస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా గ్రామంలో గంజాయి సాగు చేయుట, రవాణా చేయుట, సారాయి తయారు చేయుట మరియు అమ్మటం చట్టవరమైన అసాంఘిక కార్యకలాపాలకి పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలను మనబడి పిలుస్తుంది గ్రామంలో ఉన్న ప్రతి పిల్లలను చదువుకునేటట్లు మంచి అవకాశాలు ఉన్నాయి వారి భవిష్యత్తుకు పునాది విద్య కావున ప్రతి పిల్లవాడిని చదివించాలని దానికి కావలసిన ఎటువంటి సహాయం అయినా ఎల్లప్పుడూ మీకు చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పోలీస్ సిబ్బంది మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అత్యవసర సమావేశానికి హాజరుకండి

తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర-చింతపల్లి : తెలుగుదేశం పార్టీ చింతపల్లి మండల అత్యవసర సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విధిగా హాజరు కావాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం స్థానిక గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు టెంట్ హౌస్ వద్ద నిర్వహించు తెదేపా అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ శాసన సభ్యురాలు, తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి హాజరుకానున్నరని, కావునా చింతపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

చేతుల శుభ్రతపై అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు.అంగన్వాడీ కేంద్రంలో, పాఠశాలలలో చేతులు శుభ్రతపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రులకు తగు సూచనలు ఇచ్చారు. శుభ్రత, వ్యక్తిగత పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. స్టాప్ డయేరియా కాంపెయిన్ లో భాగంగా తాగు నీటి పరీక్షలుతో సహా చేతుల శుభ్రతపై అంగన్వాడీ, పాఠశాల విద్యార్థుల్లో అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం నుండి మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు డయేరియా నివారణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని మండలాల్లో పారిశుధ్య డ్రైవ్ లు నిర్వహించి అతిసార ప్రభలుటకు అవకాశం ఉన్న స్థలాలను గుర్తించి అచ్చట ఉన్న చెత్తను శుభ్రం చేయాలని, మురుగు నీరు నిలువ లేకుండా చర్యలు చేపట్టారు. పూడికలు తొలగించడం, ముఖ్యంగా మార్కెట్‌లు, ఆహార పదార్థాలు విక్రయించే స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక నివాసాలు వద్ద దృష్టి సారించారు. ప్రజా మరుగుదొడ్లను నిరంతరము శుభ్రపరచుటకు దృష్టి సారించారు. అన్ని తాగునీటి పథకాలపై దృష్టి సారించి, సమయానుసారంగా క్లోరినేషన్ చేయడం, తాగు నీటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మే చివరి వారం నుండి నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమంలో దాదాపు అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. బావులు, బోరు బావులు, కొళాయి లను తక్షణం తనిఖీ చేసి క్లోరినేషన్ చేశారు. తాగు నీరు మురికి నీరు కలుషితం కావడం వలన అతిసార ప్రభలుటకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని, వాటిని పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇంజనీరింగ్ సహాయకులు నీటి వసతులు నుండి కుళాయి వరకు పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలలో తాగునీరు, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో చేతులు శుభ్రపరచ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పిడి ఎం ఎన్ రాణి తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర-సీతానగరం : ప్రతీ ఒక్కరూ బ్యాంకింగ్ వ్యవస్థలోడిపాజిట్ ఖాతాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని, అలానే ఆన్లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి కోరారు. మండలంలోని పెదఅంకలంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యమంత్రిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ వ్యక్తి సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పిడి సత్యంనాయుడు మాట్లాడుతూ బ్యాంకింగ్ గురించి సైబర్ నేరాల గురించి సంస్థ సభ్యులు చక్కగా వివరించారని ప్రజలందరూ కూడా ఏవిధమైన మోసాలకు గురికాకుండా సంబంధిత బ్యాంకులలో అడిగి అవగాహన పొందాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఫణి కుమార్ మాట్లాడుతూ సంస్థ డైరెక్టర్ మరియు మేనేజర్ ఆంజనేయులు, అశోక్ కుమార్ల పర్యవేక్షణలో ఈ అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని డిజిటల్ పేమెంట్స్, ఆన్లైన్ మోసాలు గురించి ప్రజలకు తెలియజేసామన్నారు. ట్రైనర్స్ శ్రీనివాస్, వెంకటరమణ డిపాజిట్ ఖాతాలతో అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, వయోవృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాముల నాయుడు, సర్పంచ్ శ్రీనివాసరావు, ఏపిఎం తేలు పకేరు నాయుడు, సిసిలు, బ్యాంక్ సిబ్బంది, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ఎంపీపీ, సర్పంచ్ పరిశీలన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని పెద్ద మట్ట పల్లి పంచాయతీలో గల గుర్రంపేట గ్రామంలో ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధుల నుంచి పదిహేను లక్షలు రూపాయలు మంజూరు అవటంతో మూడు వందలయాభై అడుగులు పొడవున సిసి రోడ్డు వేయడం ప్రారంభించారు ఆ సీసీ రోడ్డుని మంగళవారం రోజున ఎంపీపీ కారం, లక్ష్మి స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి వారితో పాటు సిపిఎం బృందం మంగళవారంపరిశీలించారు, ఈ సందర్భంగాఎంపీపీ మాట్లాడుతూ సిసి రోడ్డు వేయటం ద్వారా రేఖపల్లి నుండి గుర్రంపేట మీదుగా నూతుగూడెం వరకు ఐదు కిలోమీటర్లు వస్తుందని చుట్టూ తిరిగితే వెళ్తే పన్నెండు కిలోమీటర్లు వస్తుందని రైతులకు పొలాలకు వెళ్లాలన్న మండలం నుండి ఎరువులు తెచ్చుకోవాలన్న వాహనాలకు చాలా డబ్బు ఖర్చు అయ్యేదని ఈ రోడ్డు వేయటం ద్వారా రైతులకు వాహనం ఖర్చు తగ్గుతుందని గుర్రంపేట గ్రామస్తులకు ఈ సిసి రోడ్డు నూతిగూడెం గ్రామస్తులకు ఏడు కిలోమీటర్లు కలిసి రావడంతో ప్రజలకు రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందని ఆమె అన్నారు ఈ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వర్షాలు పడితే ఈ రోడ్డు పైన వాహనాలు తిరిగే పరిస్థితి లేదని ఈ రోడ్డు వేయటం ద్వారా ఇప్పుడు మాకు మండలం కి వెళ్లాలన్న ఇప్పుడు ఇబ్బంది కలగదని ముఖ్యంగా రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు ఈ రోడ్డు నాణ్యత గా ఉండాలని అవకతవకలు పా ల్పడవద్దని ఆమె కాంట్రాక్టర్ కి సూచించారు .ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బట్టలు పంపిణీ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలం లోని రేకపల్లి పంచాయతీ పరిధిలో గల అన్నవరం, ఉమ్మడివరం, గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ పూనం సరోజినీ తోపాటు సిపిఎం బృందం, స్కూల్ చైర్మన్ ఎం. కన్నారావు హెచ్.ఎం.లు పి. నాగమణి ఓ మంగారెడ్డి ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు బట్టలు సర్పంచ్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ నిర్వహించారు ఈ సందర్భంగా, ఆమె మాట్లాడుతూ బాల్యం నుండే చదువులు సక్రమంగా కొనసాగితే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని ఏ విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ కాకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను బడిలో చేర్చాలని మెనో సక్రమంగా రుచిగా అందించాలని బడి చుట్టూ ఎక్కడా నీటిగుంటలో చెత్తచెదారం ఉండకుండా పరిశుభ్రంగా చూడాలని అన్నారు. వర్షాలు మొదలయ్యాయి ఈ సీజన్లో వచ్చే వ్యాధులు పట్ల ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు విద్యార్థులను గమనించాలని, ఒక బిల్డింగ్ పాడేపోవడంతో అదనపు తరగతి గదులు లేకపోవడంతోఒక తరగతి గదిలోనే ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పిల్లల్ని ఒక దగ్గరే కూర్చోబెట్టి చదువు చెప్పటం వలన పిల్లలకి చదువు అర్థం కావట్లేదని తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి వేరే తరగతి గదులు నిర్మించాలని వంట చేయటానికి గదులు లేక ఆరుబయటే వంటచేయాల్సి వస్తుందని వర్షం పడితే చాలా ఇబ్బందికరంగా ఉందని రెండు పాఠశాలలో ఇదే పరిస్థితి ఉందని అధికారులు స్పందించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాబోధన మంచిగా జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బంది ఇంజనీరింగ్ తరుణ్ పోలీస్ సాయి కుమారి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొట్టడం లక్ష్మణ్‌రావుకి ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర-జి.కె.వీధి : భారత్ ఆదివాసీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మొట్టడం రాజబాబు తండ్రి మొట్టడం లక్ష్మణ్ రావు మరణ వార్త తెలుసుకున్న శాసనసభ్యులు .మత్స్యరాస విశ్వేశ్వర రాజు దేవరపల్లి గ్రామానికి చేరుకుని లక్ష్మణ్ రావు పార్థివ దేహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. తండ్రి కోల్పోయి దుఃఖంతో ఉన్నా రాజు బాబు కుటుంబ సభ్యులకు ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి మండల, చింతపల్లి మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సి, భవిత సెంటర్ల సందర్శన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ లోని చింతూరు, నెల్లిపాక కూనవరం, విఆర్ పురం మండలాలను కే భాస్కర్‌రావు, ఏఎంఓ, ఐఈ కోఆర్డినేటర్ సమగ్రశిక్ష, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వారు ఆకస్మికంగా సందర్శించడం జరిగినది ఆయన ప్రతి మండలంలోని ఎంఆర్సిలను భవితా సెంటర్లను సందర్శించారు. ఎంఆర్సి నందు సిఆర్పిలతో సమావేశమై 2024- 25 విద్యా సంవత్సరానికి విద్యాప్రవేశ్ కార్యక్రమానికి సంబంధించి తగు సూచనలను సలహాలను ఇచ్చి ఇంతవరకు సిఆర్పిలు, విద్యాప్రవేశ్ విషయంలో మండలంలో ఏఏ కార్యక్రమాలు నిర్వర్తించారో అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా నాలుగు మండలాల్లోని భవిత సెంటర్లను సందర్శించి అక్కడ పనిచేస్తున్న ఐఈఆర్పిలు ఎన్రోల్ మెంట్ డ్రైవ్ ద్వారా ఎంతమంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలలో చేర్పించారో వారి వివరాలను అడిగి తెలుసుకుని వారికి తగిన సూచనలను తెలియజేశారు.

ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు ఘన స్వాగత ఏర్పాట్లు

విశాలాంధ్ర-సీతానగరం : పార్వతీపురం ఎమ్మెల్యేగా బోనెల విజయ్ చంద్ర ఈనెల 21న శాసనసభలో ప్రమాణస్వీకారం చేసినతర్వాత మొట్టమొదటిసారిగా బుధవారం నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపినాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అంతా లచ్చయ్యపేట వద్ద ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయనకు ఘనస్వాగతంతో భారీ ర్యాలీగా పార్వతీపురం తీసుకొని వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మూడు మండలాల నాయకులు తెలిపారు. అందరూ పెద్దఎత్తున లచ్చయ్యపేట వద్దకు తరలిరావాలని టిడిపి నాయకులు వెంట సత్యం నాయుడు, రౌతువేణుగోపాలనాయుడు, బార్నాల సీతారాం, గొట్టాపు వెంకట నాయుడు, మజ్జివెంకటేష్, గొరజాన చంద్రమౌళి, పెంకి వేణుగోపాలనాయుడు తదితరులు తెలిపారు. జనసేన నుండి కూడా పెద్ద ఎత్తున జనసైనికులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు పాటి శ్రీనివాసరావు తెలిపారు. బిజెపి నుండి కూడా పెద్దఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని జిల్లా పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

మత్తు పదార్థాలకు తావివ్వకుండా బంగారు భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుకోవాలి

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : మత్తు పదార్థాలకు తావివ్వకుండా బంగారు భవిష్యత్తుకు పునాదులు ఏర్పరచుకోవాలని అరకు అబ్కారి శాఖ సీఐ నాగవేణి, స్థానిక ఎస్ఐ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల స్థాయిలో భవిష్యత్తుకు పునాదులు వేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. గంజాయి, నాటు సారా, ద్రక్షకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరం ఉండి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అబ్కారి శాఖ ఎస్సైలు సత్యనారాయణ ప్రభాకర్, విజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానవుల్లో అహింసా జ్యోతిని వెలిగిద్దాం

శాఖాహార ర్యాలీలో భీమసింగి ఆశ్రమ నిర్వాహకులు దేవి, రజిత

విశాలాంధ్ర-జిమాడుగుల... మానవులలో అహింసా జ్యోతిని వెలిగిద్దామని భీమసింగి ఆశ్రమ నిర్వాహకులు దేవి, రజిత అన్నారు . జి.మడుగులలో శాఖాహార ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మండల కేంద్రంలో నిర్వహించే ర్యాలీకి ఏజెన్సీ 11 మండలాల్లో ఉన్న పాకలపాటి గురుదేవులు భక్తులు హాజరయ్యారని ఆమె అన్నారు. హింసను వదిలి మంచిని ఆదరించాలని తెలిపారు. ఏ జీవిని బాదించకూడదని, ఏ జీవి బాధతో మనం వినోదించకూడదని తెలిపారు. బ్రతకడానికి జీవులను హింసించనవసరం లేదని, కూరగాయలు చాలు అని అన్నారు. జీవులను హింసించరాదని, శాఖాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో.ఏజెన్సీ 11 మండలాల నుంచి పాకలపాటి గురుదేవులు భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు మృతి

విశాలాంధ్ర - రణస్థలం : లావేరు మడలంలో చిన్న మురపాక గ్రామం కు చెందిన అర్థ దశాబ్ద కాలం నుండి కాంగ్రెస్ పార్టీ వాదిగా 90 నాటి ఉమ్మడి మురపాక, చిన్నమురపాక రాజకీయాల్లో కీలక పాత్ర వహించిన నాయకుడిగా పేరుగాంచిన మీసాల రామన్న జగ్గునాయుడు సోమవారం రాత్రి మృతిచెందారు. ఈయన నాటక రంగంలో అప్పట్లో ప్రాచుర్యం పొందిన చెంచు లక్ష్మి నాటకం కీలక పాత్ర దారిగా శ్రీరాముడి పాత్రలో ఒదిగే నటుడుగా చిన్న మురపాకలో అప్పట్లో ఇప్పటి జబర్దస్తు ను తలపించే సాయంకాల రామమందిర నాటకాల్లో కీర్తి శేషులు నాజానా సూర్యానారాయణ తో కలసి కడుపుబ్బా నవ్వించేవారు. హాస్య పాత్రదారుడిగా తన ఇంటి సభ్యుల వలే ప్రేమానురాగాలతో గోవులను పెంచిన గొప్ప మనసున్న మనిషిగా రామన్న పేరుతెచ్చుకున్నారు. ఆయన మరణం పై మండల వైయస్సార్సీపీ నాయకులు సానుభూతి వ్యక్తం చేశారు.

28న పెద్దవలస సంత ఆశీల పాట

విశాలాంధ్ర-జీకే వీధి : పెదవలస గ్రామ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం నాడు జరుగు సంతకుగాను 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంత ఆశీలపాట జె.పాపా రావు ఈవోపిఆర్ఆర్డి అధ్వర్యంలో తే28.06.2024 (శుక్రవారం) మధ్యాహ్నం 3.00 గంటలకు నిర్వహించసున్నారు. సంత ఆశీలు పాటపాడదలచిన వాళ్ళు ఉ 11.00 గల నుండి మధ్యాహ్నం 3.00గం.లోపు తమ పేర్లను రిజిస్టర్ చేయించు కోవాలని పంచా యతీ డిడిఓ కిట్లంగి బాలకృష్ణ తెలిపారు.

ఆర్టీసీ నుంచి ఆస్తిపన్ను వసూళ్లు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : స్థానిక ఏపీఎస్ఆర్టీసీ మున్సిపాలిటీకి చెల్లించవలసిన రెండు లక్షల నలభై ఐదు వేల రూపాయలు ఆస్తి పన్నును డిపో మేనేజర్ ఈకేఎస్ దుర్గ మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి నారాయణరావుకు చెక్కు రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆర్.ఐ మాట్లాడుతూ మున్సిపాలిటీకి బకాయి పడ్డ ప్రభుత్వ కార్యాలయాల అస్తి పన్నును ఆయా శాఖ అధికారులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి హరి పట్నాయక్ ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు పాసుల కోసం దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-కూనవరం... గోకవరం డిపో నుంచి ఆర్టీసీ అధికారులు కూనవరం వచ్చి కూనవరం బస్టాండ్ లో పరిసర ప్రాంతాల దివ్యాంగులు మరియు విద్యార్థుల బస్సు పాసులకు సంబంధించిన దరఖాస్తులను సేకరించారు. దివ్యాంగుల బస్సు పాసుల కోసం మొత్తం43 విద్యార్థుల ఫ్రీ బస్సు పాసుల కోసం 83 రాయితీ బస్సు పాసుల కోసం 40 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డి ఎస్ శబరి దివ్యాంగుల సంఘం రవి ఎం వివి రాజు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పాచిపెంట ఎస్సైకు ప్రశంసాపత్రం

విశాలాంధ్ర-పాచిపెంట : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సక్రమంగా విధులు నిర్వహించిన పాచిపెంట ఎస్ఐ నారాయణరావుకు మన్యం జిల్లా పార్వతపురం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ప్రశంస పత్రాన్ని అందజేసినట్లు ఎస్సై నారాయణరావు విలేకరులకు తెలియపరిచారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి మండలంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటిపై ప్రతిష్ట నిఘా ఉంచటంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సమయంలో మరియు కౌంటింగ్ సమయంతో పాటు అభ్యర్థుల విజయవకాశాలు వెలువడే వరకు సక్రమంగా విధులు నిర్వహించినందుకు గాను ప్రశంస పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు ఈ సందర్భంగా మండల అధికారులు ప్రజాప్రతినిధులు ఎస్సై సేవలను కూనియాడారు.

జీవో నెంబర్-3ని పున్నరుద్ధరించాలి

మంత్రి లోకేష్‌కు మాజీ మంత్రి కిడారి వినతి

విశాలాంధ్ర - అరకులోయ: గిరిజనులకు గుండెకాయలాంటి జీవో నెంబర్ 3ని పునరుద్ధరణ చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మంగళవారం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖతో మాట్లాడి పరిష్కారం చేస్తానని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో జిఓ నెంబర్.3 పున్నరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని గతంలో తెలుగుదేశం టిడిపి ప్రభుత్వం 1986 సంవత్సరం నుండి 275 జిఓ ద్వారా ఆదివాసి నిరుద్యోగులకు ఉపాధ్యాయ పోస్టులు గిరిజన డిఎస్సి అలాగే గిరిజన మహిళా అంట్రైనెడ్ డీఎస్సి ద్వారా నూరు శాతం ఉపాధ్యాయ పోస్టులు నాటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 1999 సంవత్సరం వరకు భర్తీ చేశామని అన్నారు. 2000 సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో నెంబర్.3 ఇచ్చి నూరు శాతం ఉపాధ్యాయ పోస్టులు ఇస్తూ వంద శాతం గిరిజన ఉపాధ్యాయులకు నూరు శాతం ప్రమోషన్లు ఇచ్చే విధంగా కృషి చేశారని ఆయన తెలిపారు.గత వైసీపీ జగన్ రెడ్డి ప్రభుత్వం జీవో నెంబర్.3 రద్దు అయిందని అన్నారు. జిఓ నెంబర్.3 పున్నరుద్ధరణ చేసి ఆదివాసుని ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు ఆదివాసులకు 100 శాతం పోస్టులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కోరగా అన్ని విషయాలు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి న్యాయం చేద్దామని హామీ ఇచ్చారని మాజీ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సీఐ నాయుడు

విశాలాంధ్ర-హుకుంపేట : విధ్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటు చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు పేర్కొన్నారు. మంగళవా రం జాతీయ మాదక ద్రవ్యాల దుర్వి నియోగ దినోత్సవాన్ని పురస్కారిం చుకుని మండలంలోని బాకురు గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతు గిరిజన ప్రాంతంలో అనేక మంది విద్యార్థులు గంజాయి,సార వంటి చెడు అలవా ట్లకు బానిసై చదువుకు దూరమవు తున్నారని ఇలాంటి అలవాట్లకు దూరం కావలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ సతీస్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాదెలవలసలో అన్నసంతర్పణ కార్యక్రమం

బొన్నాడ శ్రీరాములు, రామలక్ష్మి దంపతులు
బొన్నాడ సత్యనారాయణ, సావిత్రి దంపతులు

విశాలాంధ్ర-సీతానగరం : పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనలు ఈనెల 21న శాసనసభలో ప్రమాణ స్వీకారంచేయడంతో గాదెలవలస గ్రామంలో మాజీఎంపీపీ బొన్నాడ శ్రీరాములునాయుడు-రామలక్ష్మి, సహకార సంఘం అధ్యక్షుడు బొన్నాడ సత్యనారాయణ-సావిత్రి, వారి సోదరుల కృష్ణమూర్తి-సువర్ణ, చంద్రశేఖర్-లక్ష్మిలతో పాటు భోగిశంకరరావు దంపతులు, గ్రామస్తులు గ్రామదేవతతల్లికి మొక్కులు చెల్లించి భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన టిడిపినాయకులతోపాటు మండలానికి చెందిన టిడిపినాయకులు, సర్పంచులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు.

యదేచ్ఛగా కాలం చెల్లిన నిత్యవసర వస్తువుల విక్రయాలు

తూతూ మంత్రంగా జిల్లా ఫుడ్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : మండల కేంద్రంలో యదేచ్ఛగా కాలం చెల్లిన మజ్జిగ ప్యాకెట్లు, తదితర సితాల పానీయాలు, నిత్యవసర వస్తువులు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నప్పటికీ జిల్లా ఫుడ్ విజిలెన్స్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ కిరాణా దుకాణాలలో, హెూటల్ నిర్వాకుల వద్ద, స్వల్ప ఆహార తయారీదారుల వద్ద ప్రతి నెలలో మామూలు వసూలుచేస్తూ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండలవాసులు అనుమానాలు ఉన్నాయంటున్నారు. మంగళవారం విజయలక్ష్మి కిరాణా దుకాణంలో ఓ స్టాఫ్ నర్స్ వెళ్లి 2 మజ్జిగ ప్యాకెట్లు కొనుగోలు చేసి కాలం చెల్లిన మజ్జిగ ప్యాకెట్లు అని గమనించి ప్రశ్నించగా దుకాణదారుడైన ప్రభాకర్ ఆమెను దబాయిస్తూ దురుసుగా సమాధానం ఇచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన మండల కేంద్ర వాసి అయిన కూడా అనిల్, పనస గ్రామానికి చెందిన శివకుమార్‌లు వెళ్లి కాలం చెల్లిన మజ్జిగ ప్యాకెట్లు అని గమనించి ప్రశ్నించగా రిఫ్రిజిరేటర్ లో ఉన్న మజ్జిగ, పెరుగు, లస్సి ప్యాకెట్లు , టాటా గ్లూకోజ్, తదితర శీతల పానీయాలు మొత్తం కంగారు కంగారుగా తీసి దాచేసాడు. కాలం చెల్లిన మజ్జిగ ప్యాకెట్లు, తదితర శీతాల పానీయాలు ఫ్రిజ్లో ఎలా పెడుతున్నారని ప్రశ్నించగా కొనుగోలుదారులు డేట్లను చూసి కొనుగోలు చేసుకోవాలని విక్రయాలలో క్రమంగా జరుగుతున్నా విషయమేనని దురుసుగా సమాధానం ఇచ్చారు. మండల కేంద్రంలో ఉన్న కిరాణా దుకాణాలు, వివిధ రకాల తినుబండరాళ్ల దుకాణాలలో ఇదే పరిస్థితి నెలకొందని, మండల అధికారులు, జిల్లా ఫుడ్ విజిలెన్స్ అధికారులు, కాసులకు కక్కుర్తి పడి మండల ప్రజల ప్రాణాలతో చెలగాట మారుతున్న విషయం యదార్ధంగా కనిపిస్తుందని ప్రభుత్వ అధికారులపై తీవ్ర విమర్శలు కురిపిస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ విజిలెన్స్ అధికారులు చిత్తశుద్ధితో తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తున్న వారిని మండలంలో ఇప్పటివరకు చట్టపరమైన చర్యలు తీసుకున దకాలు లేదనారు ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలూ తీసుకోవలని మండలవాసులు కోరుచునారు.

నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-జిమాడుగుల : మండల కేంద్రంలో మంగళవారం డీఈఓ. పి.బ్రహ్మాజీరావు జి మాడుగుల మండలంలో నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను బడికి పోతా కార్యక్రమంలో బడి ఈడు వయసు కలిగిన పిల్లలందరినీ బడిలో చేర్పించేటటువంటి బాధ్యత ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో డ్రాపౌట్స్ పిల్లలు లేకుండా చూడాలి. బడి ఈడు కలిగిన పిల్లలందరూ బడిలో ఉండాలి ఎవరు కూడా బడి బయట ఉండకూడదు. నేను బడికి పోతా అనే కార్యక్రమం జూన్ 13 నుండి జూలై 12 వరకు ఒక నెల రోజులు పాటు జరుగుతుంది అందరిని బడిలో చేర్పించుకోవాలి. అని ఆయన సూచించారు. మండ కేంద్రంలో ఉన్న పలు పాఠశాలలను ఎంపీపీఎస్ గాంధీనగర్. జీహెచ్ఎస్ జి.మాడుగుల. ఏపీఆర్‌టివివి జి మాడుగుల. ఎంపీయూపీఎస్ వి.కొడపల్లి పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించడం జరిగింది అలాగే మధ్యాహ్న భోజన పథకం పరిశీలించడం పరిశీలించారు. రోజు సమయానికి ఉపాధ్యాయులు. బడికి వెళ్లి నాణ్యమైన విద్య విద్యార్థులకు అందించాలని. ప్రజల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు అలాగే స్టూడెంట్ కిట్ అందరికీ అందినదా లేదా అని విద్యార్థులకు ప్రశ్నించారు. పాఠశాలల్లో టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలి పాఠశాల వాతావరణ పరిశుభ్రంగా ఉండాలి మొదలైన అంశాలు ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాబురావు పడాల్. మరియు సి ఆర్ పి లు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

జక్కువానిబంధను జాయింట్ కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర- సీతానగరం : మండలంలోని కృష్ణరాయపురం గ్రామములోని జక్కువాని బంధ చెరువును జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక మంగళవారం సాయంత్రం సందర్శించారు. మాజీ సర్పంచ్ గునుపూరు స్వామినాయుడు ఫిర్యాదు మేరకు విచ్చేసి చెరువు ఆక్రమణలపై ఆరా తీశారు. పలుచెరువుల్లో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నందున దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వే యరు, సర్పంచ్ అన్నమునాయుడు, ఆర్ ఐ శ్రీనివాసరావు, వీఆర్వో, గ్రామసర్వేయరు,రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపైడి మారమ్మ సంబరం

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం గ్రామ దేవత శ్రీపైడి మారమ్మ సంబరం ఘనంగా నిర్వహించారు. మంగళవారం పైడి మారమ్మ అనువంశిక నిర్వాహకుడు బూరుబ నారాయణరావు ఆధ్వర్యంలో తాలమేళాలు వేషధారణలతో ఘటాలకు పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల క్రితం ఊరంతా పైడిమారమ్మ దేవత పండుగలు తెచ్చామని చాలా సంవత్సరాలయిందని కావున ఒక్కరోజు ఒంటిగటం పండగ తెస్తున్నామని దీనితో వర్షాలు బాగా పడి పంటలు బాగా పండే ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉంటారని బుధవారం అనుపు పండుగ నిర్వహిస్తున్నామని కావునా భక్తులంతా పూజా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం కోరారు.

గెలుపుపై గ్రామాల్లో విజయోత్సవాలు

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్రంలోజరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయ నీకేతనం సాధి%శీ%చిన విజయోత్సవాలు ముమ్మరంగా ఆనందోత్సవాలుతో జరుపుకుంటున్నారు. చిక్కోలు జిల్లా ఆమదాలవలస నియోజకవర్గంలో కని విని ఏరుగని రీతిలో బొంపర్ మెజార్టీ సాధించిన కూన రావన్న గెలుపు ఆనందోత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయి. పొందూరు మండలంలో పల్లెలు గ్రామదేవతులకు భారీ ఎత్తున మొక్కులు తీర్చుకుంటున్నారు. అమ్మ తల్లులకు ప్రీతికరమైన మంగళవారం బురిడీ కంచరాం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వండాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో భారీ ఎత్తున గ్రామ దేవత అసిరితల్లికి చల్లదనం చేశారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు తో గ్రామస్తులు సంయుక్తంగా పసుపు కుంకుమలతో వేటలతో మొక్కులు తీర్చుకున్నారు. పొందూరు మేజర్ పంచాయితీ పరిధిలోగల లక్ష్మం పేట గ్రామంలో గ్రామస్తులు భారీ ఎత్తున ఆనంద్ ఉత్సవాలు జరుపుకున్నారు. వాడ వాడలా విందు భోజన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండలటీడీపీ అధ్యక్షులు చీగిలిపల్లి రామ్మోహన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు(చిన్నరంగా)మాజీ ఏ ఏం సి చైర్మన్ అన్నెపు రాము, జిల్లా తెలుగు యువత సంయుక్త కార్యదర్శి బలగ శంకరబాస్కర్, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి నాయుడు, ఎంపీటీసీలు బి. హారిక, ఎ. వాణి. మాజీ సర్పంచ్ ఎ. విజయలక్ష్మి, ఏం.అప్పలనాయుడు. యోగి తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్‌లో కోల్డ్ వార్...!

- సెక్టర్ అధికారి కీలక పాత్ర, - వంత పలుకుతున్న ఉన్నతాధికారి
- కమిషన్లు కక్కుర్తిలో రగడ... - భయాందోళనలో కార్యకర్తలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న ఐసిడిఎస్ కార్యాలయ పరి ధిలోని పి ఓ, సూపర్వైజర్లు, కార్యక ర్తలు, హెల్పర్ల మధ్య కోల్డ్ వారు నడుస్తుంది. ఒకరిని మించి ఇంకొకరు ఆదిపత్య పోరు సెలాయించేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోం ది. దీనికి ఒక సెక్టార్ అధికారి కీలక భూమికి పోషించినట్లు తెలియ వ చ్చింది. నిబంధనలకు విరుద్ధంగా పలుమార్లు ఓకే కేంద్రాన్ని పరిశీలిం చటం వెనుక అంతర్యం ఏమిటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పౌష్టికా హార పంపిణీ నుంచి గుడ్లు, పాలు దినుసులు ఇంటి అద్దెలు తదితర అంశాల్లో ఎవరికి చెందవలసిన కమి షన్ వారికి చెందకపోవటంతో ఈ పరిస్థితి మొదలైనట్లు తెలుస్తోంది. ఇటీవల ఒక కార్యక్రమాన్ని నిర్వహిం చిన కొంతమందిని పత్రికలకు సమా చారం అందించారని ఆ కేంద్రాలను టార్గెట్ గా వారంలో నాలుగు సార్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో పాల ప్యాకె ట్లపై జగన్మోహన్ రెడ్డి బొమ్మను తొల గించేందుకు పీవో సూపర్వైజర్ కలిసి పాల ప్యాకెట్ల గొడవనకు మార్కర్ లిచ్చి కొంతమంది కార్యకర్తలను విని యోగించుకున్నారు. ఇది తప్పని తెలుసుకున్న తరువాత కాలభైరానికి వచ్చారు. ఆ సమస్య అప్పుడు ముగి సిపోకుండా దాన్ని మనసులో పెట్టుకు ని ఆయా కేంద్రాల కార్యకర్తలను వేధి స్తున్నారని తెలిసింది. చింతాడ గ్రా మంలో రెండవ అంగన్వాడీ కేంద్రం పై ప్రతాపం చూపుతున్నారు. గత మే నెలలో కార్యకర్త, హెల్పర్ చెరో 15 రోజులు విధులు నిర్వహిస్తే సరిపో తుందని ఉన్నతాధికారుల ఆదేశాల సు స్థానిక నాయకుల ద్వారా ఫిర్యా దులకు తెర లేపినట్లు తెలుస్తుంది. దీనికి ఒక మహిళా పోలీస్ పూర్తి సహకారం ఉన్నట్లు గ్రామంలో ప్రచా రం జరుగుతుంది. అక్కడ మొదలైన వివాదం అంగన్వాడి రెండో కేంద్రాన్ని ఇటీవల మూడుసార్లు గా పరిశీలన చేసి ఏడు నుంచి మూడు ఏళ్ల పిల్లల తల్లులు గర్భిణీలు 46 మంది వద్ద లికిత పూర్వక దరఖాస్తులు తీసుకు న్నారు. అలాగే ఒక బాలింత ఆరుగు రు గర్భిణీల నుంచి కూడా దరఖాస్తు లు తీసుకున్నారు. ఎటువంటి తప్పులు దొరలకపోవడం తో గత పదిహేళ్లుగా అద్దె కొంపలో ఉంటున్న యజమానుల నుంచి అద్దె ఎంత తీసుకుంటున్నారో లిఖితపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కడ ఒక వ్యక్తి నిరాకరించారు. ఎందుకంటే ఇటీవల అతని వర్గానికి చెందిన మైనర్ బాలిక వివాహం జరిపిస్తారని ఫిర్యాదు చేసినట్లు ఆయన భ్రమించి లికిత పూర్వక సంజాయిషి ఇవ్వనని మొండికేశారు. ఇక్కడ మొదలైంది రభస గ్రామంలోని యువతపై కూడా పడింది. తప్పు జరిగే సమయంలో ఫిర్యాదు ఎవరు చేసిన తప్పులేదని తెలిసినప్పటికీ కావాలని వివాదాన్ని రేకెత్తించి అంగన్వాడి పై చర్యలకు అధికారులు చూస్తున్నారు అన్న విమర్శ ఉంది.

సెక్టర్ అధికారి కీలక పాత్ర... సెక్టర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించారని విమర్శలు ఉన్నాయి. ఆమెపై పిఓ స్థాయి అధికారి ఒత్తిడి చేసినట్లు తెలుస్తుంది. పాల ప్యాకెట్లపై జగన్ బొమ్మను మార్కర్ ద్వారా తొలగిం చేందుకు చర్యలు తీసుకున్నప్పటి నుంచి మైనర్ బాలిక వివాహం వరకు ఆ కేంద్రంపై రుద్ది ఆ కార్యకర్తను తప్పుపట్టేందుకు యత్నిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. సూపర్వైజర్ పిఓలు కలిసి చేసిన ప్రైవేట్ కాంట్రా క్టర్కు కార్యకర్తల ద్వారా పనులు చేయించారని తెలియడంతో ఆ తప్పును తప్పిపుచ్చుకునేందుకు వీరిపై అభియోగాలు మోపుతున్నారని తెలుస్తుంది. ఇప్పటికే ఈవివాదం స్థానిక తెలుగుదేశం నాయకుల ద్వారా శ్రీకాకుళం ఎమ్మెల్యేకు స్థానిక యువకులు చేరవేసినట్లు తెలిసింది. ఇదిలాఉండగా వీరి చేష్టలకు ఉన్నతాధికారులు వంత పలుకుతున్నారని తెలియవచ్చింది. ఆముదా లవలసకు చెందిన ఒక వైసీపీ నాయకుడు ఆ కేంద్రంపై గిట్టక యూనిఫామ్ వేయడం లేదని, 15 రోజులు మే నెలలో రాలేదని, గర్భిణీలకు పౌష్టికాహా రం అందించడం లేదని, ఇంటి అద్దె సక్రమంగా చెల్లించడం లేదని మరికొన్ని విషయాలతో ఫిర్యాదు చేస్తే గత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు ఆయా కేంద్రాలపై వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలు స్తోంది. దీంతో కార్యకర్తలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సెక్టార్లలో పూర్తిగా ఆయాలతో పనులు నిర్వహిస్తున్నప్పటికీ పరిశీలన చేయని అధికారులు కొన్ని కేంద్రాలపైనే దృష్టి సారించడం వెనక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల చిట్టివలస పరిధి గొంతువానిపేట రోస్టర్ మార్పు చేసి నియామకం జరిపించారని ఇటీవల ఎన్నిక ల ప్రచారంలో స్థానికులు నాయకులు వద్ద మొరపెట్టారు. అధికారం చేపట్టిన తర్వాత పరిశీలించి చర్యలు చేప డతామని హామీ ఇచ్చారు. ఈ వ్యవహారం కూడా ఈ అధికారుల మధ్య జరిగిందని తెలిసింది. ఐసిడిఎస్‌లో జరుగుతున్న అంతర్గత యుద్ధానికి ఉన్నతాధికారులు పరిశీలన చేసి స్వస్తి పలికించకపోతే ఈ వివాదాలు ఆయా కేంద్రాల విద్యార్థుల మానసిక ఒత్తిడి పై ప్రభావం చూపుతోందని విమర్శలు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న అపకత వక లను పరిశీలించి చర్యలు తీసుకోవా లని పలువురు కోరుచున్నారు.